ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024
5
శ్రీ సత్యసాయి



# ఆర్టీసీ బస్సు ఢీకొని మెడికల్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి ఆదివారం కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అందుకు సంబంధించిన వివరాలు... పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన తేజేశ్వర్ రెడ్డి కర్నూల్ మెడికల్ కళాశాలలో మూడవ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో తేజేశ్వరరెడ్డి(19) ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తేజేశ్వరరెడ్డి తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తమ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పిల్లిగుండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతుడు తేజేశ్వరరెడ్డి

# టిడ్కో ఇళ్లకు మహర్దశ వచ్చేనా..?

## నూతన ప్రభుత్వమైనా కనికరించేనా..? పేదల కల నెరవేరేనా..? ఆరేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు



కొటిపి వద్ద నిర్మాణ దశలోనే ఆగిన టిడ్కో గృహాలు

**హిందూపురంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్మాణం చేసిన టిడ్కో గృహాలు నేటికీ లబ్ధిదారులకు అందలేదు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘాలలో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే ఆ పనులు నేటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తి అయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించ లేదు. దీంతో పేదల సొంతింటి కల నెరవేరలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు నేటికి నిర్మాణం చేసిన టిడ్కో గృహాలను తమకు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.**

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలో 16 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను 2018 జనవరి 10న ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ఆ సమయంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు, రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశారు. అందరికీ ఇళ్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు సంయుక్తంగా జీ ప్లస్–3 తరహాలో అపార్టుమెంట్ల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారుని వాటాతో ఇళ్లు నిర్మించ తలపెట్టారు. 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఆ సమయంలో లబ్దిదారులు ముందుకు రాక పోవడంతో అప్పటి పాలక వర్గం ప్రజలకు అవగాహన కల్పించి డిడిలు చెల్లించే విధంగా చూడడంతో కొంత మంది ముందుకు వచ్చి డిడిలు చెల్లించారు. ఇందులో క్యాటగిరిల వారిగా 300 చదరపు అడుగులకు 1104 మంది, 365 చదరపు అడుగులకు 1344, 430 చదరపు అడుగులకు 288 మంది మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు. బ్యాంకు లింకేజీ క్రింద లబ్దిదారుల వాటాకు రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు సైతం వారు ఇప్పించారు. అయితే పనులు మాత్రం 2019 సార్వత్రిక ఎన్నికల మందు నుంచి ఆగిపోయాయి. పూర్తి అయిన టిడ్కో గృహాలను జగన్ ప్రభుత్వం ఉచితంగా లబ్దిదారులకు కేటాయిస్తామని చెప్పడంతో పాటు 2022 జూన్ లో లబ్దిదారులకు ఆ ఇళ్లను రిజిస్టర్ చేస్తున్నట్లు చెప్పి రిజిస్టర్ ప్రక్రియ సైతం చేపట్టారు. అయితే టిడ్కో గృహాల పనులు మాత్రం వైసిపి ప్రభుత్వం చేపట్టలేదు. ఇది చాలదన్నట్లు క్యాటగిరిల వారిగా టిడ్కో గృహాలను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలైనా సకాలంలో పూర్తి లబ్దిదారులకు ఇచ్చారంటే అది లేదు.

**ఉమ్మడి జిల్లాలో కేటగిరీల వారీగా రద్దయిన టిడ్కో గృహాలు....**

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఆధ్వర్యంలో మొదటి దశలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చేపట్టిన టిడ్కో ఇళ్లకు సంబంధించి మొత్తంగా 7184 ఇళ్లను రద్దు చేశారు. ప్రధానంగా 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇందులో ఆ మూడు కేటగిరీల వారీగా పరిశీలిస్తే 300చదరపు అడుగులకు సంబంధించి 1472 ఇళ్లను రద్దు చేయగా, అందులో తాడిపత్రిలో 512, పుట్టపర్తిలో 288, కదిరిలో 96, హిందూపురంలో 384, గుత్తిలో 192 ఇళ్లు ఉన్నాయి. 365 చదరపు అడుగులకు సంబంధించి 3456 ఇళ్లను రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థల పరిధిలో 1008, తాడిపత్రిలో 240, గుంతకల్లులో 144, పుట్టపర్తిలో 288, పామిడిలో 720, కదిరిలో 48, హిందూపురంలో 960, గుత్తిలో 48 ఇళ్లు ఉన్నాయి. 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి మొత్తంగా 2256 ఇళ్లు రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థలో 1056, తాడిపత్రిలో 384, రాయదుర్గంలో 48, గుంతకల్లులో 192, పుట్టపర్తిలో 144, పామిడిలో 144, కదిరిలో 48, హిందూపురంలో 192, గుత్తిలో 48 ఇళ్లను ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. వీరందరికి స్థలం కేటాయించారు. అయితే ఆ సమయంలో టిడ్కో గృహాల కోసం చెల్లించిన డిడిలు మాత్రం నేటికి తిరిగి ఇవ్వలేదు.

**టిడిపి ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందా..?**

2014లో అధికారంలోకి వచ్చే ముందు చంద్రబాబు నాయుడు ఇళ్లు లేని పేదలందరికి సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పారు. అదే విధంగానే టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టారు. అయితే 2019లో ప్రభుత్వం మారడం, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం టిడ్కోను నిర్లక్ష్యం చేయడంతో టిడ్కో గృహాల సముదాయం కాస్తా అసాంఘిక కార్యక్రమాలను నిలయాలుగా మారాయి. అయితే తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో టిడ్కోపై ప్రత్యేక దృష్టి సారించాల్సుంది. నిర్మాణాలు జరిగిన బ్లాక్‌లలో మౌళిక సదుపాయాలను కల్పించి లబ్దిదారులకు ఇవ్వడంతో పాటు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఇళ్లను పునరుద్దరించారు. ఆగిన పనులను ప్రారంభించి త్వరతగితిన పనులను పూర్తి చేసి లబ్దిదారులకు ఇచ్చే విధంగా చర్యలు చేపడితే వేలాది మందికి సొంతింటి కల నెరవేరుతుంది.



టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫొటో)



హంద్రీనీవా కాలువ

# 'హంద్రీ నీవా'లో కదలికొచ్చేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


హంద్రీనీవా వెడల్పు పనులు ముందుకు సాగుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలం మాల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకు మొదటి దశలో ప్రస్తుతం 1800 క్యూసెక్కులు నీటి ప్రవాహం వస్తోంది. దీని వలన శ్రీశైలం డ్యామ్‌కు వరద వచ్చిన సమయంలోనూ అధికంగా నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 1800 క్యూసెక్కులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో వరద సమయాల్లో నీరు అధికంగా తీసుకునేందుకు వీలుగా హంద్రీనీవా కాలువ వెడల్పును ఆరు వేల క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. ఆరు వేల కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచి మెగా సంస్థకు పనులు అప్పగించారు. కాని పనుల్లో కదలిక మాత్రం ఆఖరు వరకు రాలేదు. ఫలితంగా 2020, 2021,2022 మూడు సంవత్సరాలు పెద్ద ఎత్తున వర్షాలొచ్చినా అధికంగా నీటిని తీసుకోలేని పరిస్థితి నెలకొంది.

**అనేక ప్రాజెక్టులకూ సమస్య**

హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, అదనంగా వచ్చే నీటి కేటాయింపులను కూడా ప్రభుత్వం చేసింది. శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని అనేక చెరువులకు నీటిని అందివ్వాలని నీటి కేటాయింపులు జరిపారు. అయితే కాలువ వెడల్పు పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఇవి పూర్తయితే తప్ప పైన పేర్కొన్న చెరువులకు నీరు వెళ్లదు. అంతేకాకుండా భైరవానితిప్పకు నీటిని అందించే పనులు జరగాల్సి ఉంది. దీంతోపాటు పేరూరు ఎత్తిపోతల పథకం, పుట్టపర్తి ఎత్తిపోతల పథకం, పిఎబిఆర్ కమ్యూనిటీ లిప్టు ఇరిగేషన్ స్కీమ్ పనులు ముందుకు సాగలేదు.

**కొత్త ప్రభుత్వమైనా పరుగులు పెట్టించేనా...**

అభివృద్ధి నినాదంతో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. వాస్తవానికి 2018 సంవత్సరంలో టిడిపి హయంలోనే బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలకు టెండర్లు అయ్యాయి. కొంత వరకు పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రివర్సు టెండరింగు పేరుతో పనులను కొంతకాలం నిలిపివేసింది. ఆ తరువాత భూసేకరణ సమస్య అంటూ పనులు చేపట్టలేదు. ఇప్పటికీ భూసేకరణ పూర్తవలేదు. పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు టిడిపి ఈ పనులను ఏ మేరకు ముందుకు తీసుకెళు తుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ పనులను ముందుకు తీసుకెళుతామని టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మొదలుకుని ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచార సమయంలో హామీలిచ్చారు. ఈ హామీలను ఏ మేరకు అమలు చేయగలుగుతారో చూడాల్సి ఉంది.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం : యుటిఎఫ్

ప్రజాశక్తి- కొత్తచెరువురూరల్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, 117 జీవో, 3, 4, 5 తరగతుల విలీనం జీవోలను వెంటనే రద్దు చేయాలన్నారు. 1998, 2008 ఉపాధ్యాయులను రెగ్యులైజేషన్ చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన యాప్‌లను రద్దు చేయాలన్నారు. నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వం తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. యుటిఎఫ్‌ను జిల్లావ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బూతన్న, ఉపాధ్యక్షులు బాబు, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాహిర్‌వలి, వైవి.సుబ్బారెడ్డి, అనిల్‌కుమార్, రామకృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

# స్థానిక చరిత్రలు రికార్డు చేయాలి

## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి

ప్రజాశక్తి - అనంతపురం

నొళంబుల చరిత్రను రికార్డు చేయడం సిద్ధగిరి శ్రీనివాస్ చేసిన సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన "నొళంబ వాడి" పుస్తకపరిచయసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిచయ సభకు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్. జెన్నె ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా బండి నారాయణస్వామి మాట్లాడుతూ మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్ధగిరి శ్రీనివాస్ తన స్థానిక చరిత్రను రికార్డు చేయాలన్న ఒక తలంపులో నుంచి ఈగొప్ప చరిత్ర రచన పుట్టుకు వచ్చిందని, అది చరిత్రకు కొత్త చేర్పు అయిందని అన్నారు. చరిత్ర అధ్యయనం నానాటికి కుంటుపడుతోందని ప్రతి ఒక్కరూ చరిత్ర అధ్యయనంపై దృష్టి సారించాలని అన్నారు. సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ సిద్ధగిరి శ్రీనివాసుల సునిశితమైన పరిశీలన జ్ఞానమే ఈ పుస్తక రూపకల్పనకు దారితీసిందని, ఇలాంటి మరెన్నో పుస్తకాల రూపకల్పనకు ఆయన శ్రీకారం చుట్టాలని అన్నారు. 'ఫర్ ద సొసైటీ చారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ కవులు తమ రచనలతో ఈ సమాజానికి దిశా నిర్దేశం చేస్తున్నారని, యువత ఈ రచనల అధ్యయనం వైపు దృష్టి సారించాలని అన్నారు. 'అనంత విద్యావంతుల వేదిక' అధ్యక్షులు బండి నాగరాజు మాట్లాడుతూ మరుగున పడిన చరిత్రను వెలుగుపరిచిన సిద్ధగిరి శ్రీనివాస్ ఆదర్శనీయుడన్నారు. శేషగిరి రాయుడు మాట్లాడుతూ కాషాయీకరణలో భాగంగా నేడు చరిత్ర అంతా వక్రీకరించబడుతోందని నిక్కచ్చిగా చరిత్రను రికార్డు చేయాల్సిన అవసరం ఉందని, ఆ పని ఇటీవల కాలంలో సిద్ధగిరి శ్రీనివాస్ చేయగలిగారని అన్నారు. డాక్టర్ అంకె శ్రీనివాస్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సిద్ధగిరి ఈ పుస్తక రూపకల్పనలో పడిన కష్టాన్ని, శ్రమని, ఆయన వెచ్చించిన సమయాన్ని, ఓర్పును వెలకట్టలేమని అన్నారు. ఈ పుస్తకం స్థానిక చరిత్రల రూపకల్పనలో మిగతా ప్రాంతాల ఔత్సాహిక రచయితలకు ఒక ప్రోత్సాహంగా నిలబడుతుందని అన్నారు. రచయిత సిద్దగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతపు చరిత్ర ఆనవాళ్ళను వెతుకుతున్న క్రమంలో రాసుకున్న పుట్ నోట్సే ఈ పుస్తకమని అన్నారు. ఈసందర్భంగా అతిథుల చేతుల మీదుగా రచయితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లలిత కళా పరిషత్ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులు కంబదూరి షేక్ నబీరసూల్, మధుర శ్రీ, కొత్తపల్లి సురేష్, కోటిగారి వన్నప్ప, తరిమెల అమర్నాథ్ రెడ్డి, గోవిందరాజులు, చేగువేరా హరి, జీ.విశ్వనాథ్ రెడ్డి, వలస రమేష్, తలారి రామాంజనేయులు, అడ్వకేట్ చంద్రాచెర్ల హరి, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్, అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లయినా ముందుకు పడని అడుగు

## టెండర్ల ఆమోదానికి పరిమితమైన వంతెన పునరుద్ధరణ
## పెన్నా పరుగులు పెడితే రాకపోకలు బంద్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలంలోని పలు గ్రామాలు హిందూపురం పట్టణానికి, కర్నాటకలోని అనేక గ్రామాలకు రాకపోకలకు స్థానిక పోచనపల్లి వద్ద పెన్నా నది మీద ఉన్న వంతెనే ఆధారం. దీనిని 70 ఏళ్ల కిందటే అప్పటి పాలకులు నిర్మించారు. అప్పటి నుంచి నేటి దాకా కనీస మరమ్మతులు సైతం చేయలేదు. నాలుగుసంవత్సరాల క్రితం పెన్నా ఉధృత ప్రవాహానికి వంతెన మధ్య భాగం దెబ్బతింది. అప్పటి నుంచి మరమ్మతులు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గత వైసిపి ప్రభుత్వ హయాంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో రెండున్నర ఏళ్ల కిందట రూ.80 లక్షలు మంజూరయ్యేలా చూశారు. ఈ నిధులతో వంతెన దెబ్బతిన్న పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పెన్నా నది ప్రవాహానికి వంతెన మధ్య భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాలకు, పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలియకుండా ఆ సమయంలో కర్నాటక ప్రాంతం నుంచి ఒక వ్యక్తి హిందూపురం పట్టణానికి వస్తూ వంతెన దెబ్బతిన్నచోట నుంచి కిందికి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమీప గ్రామ ప్రజల డిమాండ్ మేరకు కూలిన వంతెన వద్ద రాకపోకలను పునరుద్ధరించడానికి రెండేళ్ల కిందట తాత్కాలికంగా రూ.10 లక్షలతో ఇనుప వంతెన నిర్మాంచారు. దీనిపైన ద్విచక్రవాహనాలు, సైకిళ్లు పోవడానికి, పాదచారులు నడిచి వెళ్లడానికి అవకాశం దక్కింది. భారీ వర్షాల సమయంలోనూ, నది ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలోనూ తాత్కాలిక వంతెన పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పట్టణానికి చెందిన ఓ గుత్తేదారుడు పనులు చేశారు. ఆయనకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. బిల్లు కోసం అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నారు. తాత్కాలిక పనులు కావడంతో ఈ వంతెన మూన్నాళ్ళ ముచ్చటగా మారింది. అది కూలిపోయే పరిస్థితి రావడంతో ప్రస్తుతం దాని మీద రాకపోకలు నిలిపివేశారు. ఆ సమయంలో ప్రవాహం నిలిచి పోగానే వంతెన పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పినా నేటికీ రూపాయి పని చేయలేదు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. పనుల్లో పురోగతి లేక, కూలిన వంతెన పక్కన నదిగర్భంలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన కూలిన విషయం తెలియక, దాని మీద ప్రయాణం చేసిన ఇతర ప్రాంతాల వారు తరచూ ప్రమాదాల పాలవుతున్నా అధికారులు, పాలకుల్లో కనీస స్పందన లేదు. వంతెన పనులు పూర్తికాకపోవడంతో ఓ నిండు ప్రాణం బలయిందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం కర్నాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు పెన్నా ఉధృతంగా ప్రవహించే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే ఆయా గ్రామాలకు, పట్టణానికి రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.నూతన ప్రభుత్వం, అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన వంతెన స్థానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన



తాత్కాలిక వంతెన దెబ్బ తినడంతో కంప చెట్లు వేసిన దృశ్యం.



శిక్షణ పొందిన విద్యార్థులతో డిఇవో మీనాక్షిదేవి

## ప్రాచీన కళలను ప్రోత్సహించాలి : డిఇఒ

**ధర్మవరం టౌన్ :** భారత ప్రాచీన కళలను అందరూ ప్రోత్సహించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని డిఇఒ మీనాక్షి దేవి, అనంతపురం లలిత కళా పరిషత్ ఛైర్మన్ పద్మజ, ఎపి సకల కళా వృత్తి సంఘం అధ్యక్షులు ఆనంద్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ లలిత నాట్య కళానికేతన్, వేసవి నాట్య శిక్షణ శిబిరం ముగింపు సంబరాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువు బాబు బాలాజీ మాట్లాడుతూ శిబిరంలో 45 రోజుల పాటు 60 మంది విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం, జానపద గేయాలు నేర్పించామని తెలిపారు. అనంతరం 50 మందికి ముఖ్య అతిథులు మెమొంటోలు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కళాకారులు, కమలా బాలాజీ, రామ లాలీత్య, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## హిందూపురం చేరుకున్న బాలయ్య

**హిందూపురం :** ఎమ్మెల్యేగా మూడో సారి విజయం సాధించిన నందమూరి బాలకృష్ణ ఆదివారం సాయంత్రం పట్టణం చేరుకోగా టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన చిలమత్తూరు మండలం కొడికొండ చెక్ పోస్ట్, లేపాక్షి మీదుగా హిందూపురం చేరుకున్నారు. ఆయనకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ జెవి.అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, జేఈ వెంకటస్వామి, షఫీవుల్లా నెట్టప్ప తదితరులు పూలమాలలు వేసి, బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం ఆవరణలో పార్టీ శ్రేణులు ఏర్పాటుచేసిన కేక్‌ను బాలయ్య కట్ చేశారు. గతంలో సాదాసీదాగా వచ్చే బాలయ్య ఈ మారు భారీ కాన్వాయ్‌గా రావడం విశేషం.



ఎమ్మెల్యే బాలకృష్ణకు బోకే ఇస్తున్న నాయకులు

## లేపాక్షి గురుకుల పాఠశాలకు దొడగట్ట విద్యార్థులు

**రొద్దం :** లేపాక్షిలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు మం డలంలోని దొడగట్ట పాఠశా ల విద్యార్థులు ఎంపికైనట్లు ఉపాధ్యాయు లు హరీష్, తేజ ఆదివారం తెలిపారు. మండలంలోని దొడగట్ట ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బి.అభినయ్, డిఎన్.వంశీవిష్ణు లేపాక్షి మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి పరీక్షలో ప్రతిభ చాటి సీట్లు సాధించారు. గతంలో ఇదే పాఠశాల నుంచి ముగ్గురు బాలికలు హిందూపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు తెలపారు. సీట్లు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



గురుకుల పాఠశాలకు అభినయ్, వంశీవిష్ణు



'ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం' వద్ద టిడిపి నాయకులు

## ఇక 'ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం'

**సోమందేపల్లి :** పెనుకొండ పట్టణంలో గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియాన్ని ఆదివారం ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంగా పేరు మార్చారు. 2019లో వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చడంతో పాటు రంగులు మార్చిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే ఎస్.సవితమ్మ ఆదేశాల మేరకు ఆదివారం గతంలో ఉన్న విధంగానే దానికి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంగా పేరు మార్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాండురంగస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న కూటమి శ్రేణులు

## కూటమి నాయకుల సంబరాలు

**ధర్మవరం టౌన్ :** ధర్మవరం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ విజయం సాధించడంతో ఆదివారం కూటమి శ్రేణులు పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో పాండురంగస్వామికి 101 కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మాధవరెడ్డి, హోటల్ మారుతిస్వామి, సదాశివానంద, మాదన మహేశ్వరి, తొగట అనిల్, సిబిఎన్ రామక్రిష్ణ, తోట నారాయణస్వామి, బి.గంగాధర్, మారుతీకుమార్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

## కళలను ప్రోత్సహించాలి

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

తల్లిదండ్రులు తమ పిల్లలను కళల అభ్యాసంలో ప్రోత్సహించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం గాయత్రీ డ్యాన్స్ అకాడమీ 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రామ్‌కుమార్‌తో పాటు సంఘం పట్టణ అధ్యక్షుడు కలవల మురళీధర్ హాజరయ్యారు. కలవల రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 23 ఏళ్లుగా వేసవిలో వివిధ రకాల డ్యాన్సులు, నత్యాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన క్లాసికల్ డ్యాన్సులు, సినీ నృత్యాలు చూపరులను ఆకట్టుకు న్నాయి. అనంతరం చిన్నారులకు మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కిశోర్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొండకమర్ల, రేపు ఓడిసి వారపుసంత బహిరంగ వేలం

**ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు**

మండల పరిధిలోని కొండకమర్ల, మండల కేంద్రమైన ఓడిసిలో వారపుసంత, గేటు వసూలు చేపట్టేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వరలక్ష్మి, ఈఓఆర్డి రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కొండకమర్లలో, 11న ఉదయం ఓడిసిలో ప్రజల సమక్షంలో వారపుసంత, గేటు వసూళ్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు అరగంట ముందుగా ధరావత్తు రూ. 50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న వారు మాత్రమే ఇందుకు అర్హులని తెలిపారు.


# కొట్నూరు చెరువులో చేపలు మృత్యువాత!

**- కాలుష్యమా.. మత్స్య శాఖ నిర్లక్ష్యమా.? - కంపు కొడుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం**

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పురపాలక సంఘంలోని కొట్నూరు చెరువులో ఆ వార్డ్ కౌన్సిలర్ అండదండలతో తమిళనాడు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అనధికారికంగా చేపలు పడుతున్నాడు. ఈ విషయంపై గత మే నెలలో అన్ని వివరాలతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో సకాలంలో స్పందించి బహిరంగ వేలం వేయాల్సిన మత్స్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు తాము బహిరంగ వేలం నిర్వహించమని, మున్సిపల్ శాఖ పరిధిలో ఉండడంతో మున్సిపల్ కమిషనర్ బహిరంగ వేలం వేస్తారని పేర్కొన్నారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్‌ను ప్రజాశక్తి కలిసి సమస్యను వివరించింది. ఆయన వెంటనే మత్స్య శాఖ అధికారులను పిలిపించి నిబంధనల మేరకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆదేశించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు ఎన్నికలు ముగిసిన వెంటనే బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్‌తో పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం చెరువులో ఉన్న చేపలన్నీ మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చెరువులోని కాలుష్యం వల్ల చేపలు మృతి చెంది ఉంటే గతంలోనే మృతి చెందాలి. అలా కాకుండా మరికొన్ని రోజుల్లో కొట్నూరు చేపల చెరువును బహిరంగ వేలం వేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా చేపలు మృతి చెందడం వెనక ఎవరో విష ప్రయోగం చేసి ఉంటారన్న అనుమానాలను కొట్నూరు ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మత్స్య శాఖ ఉన్నతాధికారులతో విచారణ జరిపిస్తే సమగ్ర వివరాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏదైమైనా కొట్నూరు చెరువులో ఒక్కసారిగా చేపలు మృతి చెందడంతో పట్టణంతో పాటు హిందూపురం–పెనుకొండ రహదారిపై దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

> 'పట్టణ పరిధిలోని కొట్నూరు చెరువులో పెద్దఎత్తున చేపలు మృత్యువాత పడ్డాయి. ఇందుకు కాలుష్యమా.? లేక మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమా అనే విషయం అర్థం కావడం లేదు. మొత్తానికి చెరువులో ఉన్న చేపలన్నీ మృతి చెంది దుర్వాసన వెదజల్లుతున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు'.



కొట్నూరు చెరువులో మృత్యువాత పడిన చేపలు

# నేడు కామ్రేడ్ 'పర్స' శతజయంతి ఉత్సవాలు

**జయప్రదం చేయాలి : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్**

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

కామ్రేడ్ పర్స సత్యనారాయణ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పర్స జయంతి ఉత్సవాలు 2023 జూన్ 2వ తేదీ ప్రారంభమై 2024 జూన్ 2వ తేదీ ముగిసిన సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాలో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కామ్రేడ్ పర్స సత్యనారాయణ జయంతి ఉత్సవాలను పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలి పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు హాజరవుతారన్నారు. కామ్రేడ్ పర్స జీవితం ఉద్యమ కెరటాల్లో ఆవిర్భవించిందన్నారు. 1970లో సిఐటియు ఆవిర్భావం నుంచి 2002 వరకూ రాష్ట్ర అధ్యక్షులుగా, అఖిల భారత ఉపాధ్యక్షులుగా పని చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడానికి అనేక రకాలుగా కృషి చేయడంలో ముందున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎర్రబావుటా కింద రెపరెపలాడటా నికి బీజం వేశారన్నారు. వర్గ పోరాట సిద్ధాంతాన్ని అమలు చేయడానికి నిరంతరం కృషి చేశారన్నారు. 9 ఏళ్ల జైలు జీవితం అనుభవించారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం సందర్భంగా 1966లో ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేశారన్నారు. ఉద్యోగిగా ప్రారంభమైన జీవితాన్ని విప్లవోద్యమం కోసం వృత్తిని వదిలి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధునిగా మెలిగి బొగ్గు కార్మికులను సంఘటిత పరచడంలో ఎంతో కృషి చేశారన్నారు. ఎఐటియుసి నాయకునిగా ఎదిగి సిఐటియు ఏర్పడ్డాక రాష్ట్ర ప్రధాన బాధ్యతలు చేపట్టి సుదీర్ఘకాలం అధ్యక్షునిగా తన ఉద్యమ ప్రస్థానాన్ని సాగించారన్నారు. కావున ఈ శత జయంత్యుత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సాహితీవేత్తలు, సిఐటియు, సిపిఎం నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రి పదవులు ఇవ్వాలి

**కురుబ సంఘం నాయకుల విన్నపం**

**ప్రజాశక్తి-హిందూపురం**

సుదీర్ఘకాలం టిడిపిలో ఉంటూ వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధిగా పని చేయడంతో పాటు తాజాగా హిందూపురం పార్లమెంట్ సభ్యులుగా (రెండోసారి) గెలిచిన బికె.పార్థసారథికి కేంద్ర మంత్రివర్గంలో, పెనుకొండ శాసనసభ్యులుగా ఎంపికైన ఎస్.సవితమ్మకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని కురువ సంఘం నాయకులు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు విన్నవించారు. వారు ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి కురుబలు ఆ పార్టీకి వెన్నంటే ఉంటూ పార్టీ విజయం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా హిందూపురం ఎంపీగా గెలుపొందిన కురుబ సామాజిక వర్గానికి చెనిన బికె.పార్థసారధికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. అలాగే పెనుకొండ ఎమ్మెల్యేగా గెలుపొందిన కురుబ సవితమ్మను రాష్ట్ర మంత్రిగా నియమించాలని విన్నవించారు. ఇటు పార్టీ, అటు ప్రజాభివృద్ధికి కృషి చేసే కురుబ ప్రజాప్రతినిధులకు మంత్రులుగా అవకాశం కల్పించాలని బిజెపి జాతీయ అధిష్టానం, రాష్ట్ర టిడిపి అధిష్టానం నాయకులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కురుబ సాధికారత కన్వీనర్ మల్లికార్జున, సంఘం నాయకులు జగదీష్, నటరాజ్, బాలకృష్ణ, శ్రీధర్, రమేష్, హరీష్, గోపాల్, రామకృష్ణ, మోహన్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురువ సంఘం నాయకులు

# మొక్కజొన్న 5106 రకంతో రైతులకు లాభాలు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మొక్కజొన్నలో హైటెక్ కంపెనీ ఉత్పత్తి చేసిన కొత్త రకం విత్తనం 5106తో రైతులు అధిక దిగుబడి సాధించడంతో పాటు వ్యవసాయంలో లాభాల బాట పడతారని హైటెక్ సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. పెనుకొండ పట్టణంలోని భీమినేని ప్రవీణ్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆ కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ హైటెక్ కంపెనీ ఉత్పత్తి చేసిన నూతన మొక్కజొన్న విత్తనం 5106 విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. తద్వారా రైతులకు అధిక దిగుబడితో పాటు మంచి లాభాలు వస్తాయన్నారు. హైటెక్ కంపెనీ రైతులకు లాభదాయకమైన విత్తనాన్ని ఉత్పత్తి చేస్తున్నందున ఆ విత్తనాన్ని రైతులకు అందించడంలో డీలర్లు కృషి చేయాలని కోరారు. నాణ్యమైన విత్తనాన్ని చేర్చడం ద్వారా రైతులు నష్టపోకుండా మంచి విత్తనాన్ని ఎంపిక చేసుకోవడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు హైటెక్ వారి 5106 విత్తనాన్ని అందజేసి అధిక ఉత్పత్తిని సాధించేందుకు డీలర్లు కృషి చేయాలని తెలిపారు. రైతు మిత్ర సీడ్స్ హిందూపురం, రేవతి సీడ్స్ అనంతపురం, ప్రాంతీయ విత్తన అభివృద్ధి మేనేజర్ నాగేందర్‌రెడ్డి, డీలర్స్ మీటింగ్ అసోసియేషన్ ఆధీకృత డీలర్లు, పెనుకొండ, మడకశిర, రొద్దం, గోరంట్ల హైటెక్ సీడ్స్, ఉత్పాదక సంస్థల వారి ఏజెంట్‌గా వ్యవహరించారు. సమావేశంలో స్థానిక సీడ్స్ డీలర్లు సుగుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, తదితర డీలర్లు పాల్గొన్నారు.



సమావేశమైన హైటెక్ సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీలర్లు



ఎమ్మెల్యే బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

## ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘన స్వాగతం

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

టిడిపి తరఫున వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణ హిందూపురం వస్తున్న తరుణంలో కర్నాటకలోని బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, నాగరాజుయాదవ్, లక్ష్మినారాయణయాదవ్, జనసేన చిన్నా, ప్రవీణ్ బాలయ్యకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. బాలయ్య మాట్లాడుతూ మీ అందరి ఆదరణ, ప్రేమాభిమానాల వల్లే నేను గెలుపొందానని, నియోజక వర్గాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉందన్నారు. అనంతరం హిందూపురం బయల్దేరి వెళ్లారు. బాలయ్యకు స్వాగతం పలికేందుకు కార్యకర్తలు వేలాదిగా తరలి రావడంతో టోల్ గేట్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సాయి కుల్వంత్ హాలులో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## సత్యసాయి సేవలు మరువలేనివి

**పుట్టపర్తి అర్బన్ :** ఉమ్మడి అనంతపురం జిల్లాకు సత్యసాయి అందించిన సేవలు మరువలేనివని అనంతపురం జిల్లా సత్యసాయి సేవా సమితి కోఆర్డినేటర్ నరసింహమూర్తి పేర్కొన్నారు. దాదాపు 2500 మంది భక్తులు పర్తి యాత్రగా వచ్చిన అనంతపురం జిల్లా వాసులు రెండో రోజైన ఆదివారం సాయి కుల్వంత్ హాలులో ప్రత్యేక భజనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాకు సత్యసాయి ట్రస్టు విద్య, వైద్యం, తాగునీరు అందిస్తోందన్నారు. ప్రభుత్వాలు చేయలేని పనులను సత్యసాయి ట్రస్టు చేపట్టడం స్ఫూర్తిదాయక మన్నారు. పర్తి యాత్రగా సత్యసాయి మహా సమాధి చెంతకు రావడం ఆనందంగా ఉందన్నారు. సత్యసాయి బోధనలు సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి ప్రవచనాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. సాయంత్రం సాయి కుల్వంత్ హాలులో బాల వికాస్ విద్యార్థులు చేసిన సంప్రదాయ నృత్యాలు భక్తులను అలరించాయి.

## రామోజీరావు మృతికి పాత్రికేయులు సంతాపం

**చెన్నేకొత్తపల్లి :** జర్నలిజంలో నూతన ఒరవడిని సృష్టించిన ఈనాడు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పట్ల ఆదివారం పాత్రికేయులు శ్రద్ధాంజలి ఘటించారు. చెన్నేకొత్తపల్లిలో రామోజీరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పలువురు పత్రికా విలేకరులు మాట్లాడుతూ ప్రజల పక్షాన వార్తలు రాసి జర్నలిజానికే వన్నె తెచ్చిన మంచి మనిషి, మృదుస్వభావి రామోజీరావు అన్నారు. ఆయన మృతి బాధాకరం అన్నారు.

# నేరాలు ఘోరాలు

## బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

**పుట్టపర్తి క్రైమ్ :** మండల పరిధిలోని కంబాలపర్తి గ్రామ సమీపంలో ఆదివారం సాయంకాలం 4 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న మెకానిక్ కిరణ్ ద్విచక్ర వాహనంపై ముగ్గురు నల్లమాడ నుంచి పుట్టపర్తికి వస్తుండగా పుట్టపర్తి నుంచి నల్లమాడకు మరో ద్విచక్ర వాహనం అన్నాచెల్లెలు వెళ్తుతుండగా మార్గమధ్యలో కంబాలపర్తి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కిరణ్‌తో పాటు మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యా యి. కిరణ్ తలకు, కాలికి బలమైన గాయాలయ్యాయి. పుట్టపర్తి నుంచి నల్లమాడకు తిరిగి వెళ్తున్న రామాంజనేయ కాలు విరిగిపోయింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

**పుట్టపర్తి క్రైమ్ :** కుక్కల దాడిలో నాలుగు గొర్రెపిల్లలు మృత్యువాత పడిన సంఘటన ఆదివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లిలో జరిగింది. బాధితుడు రామచంద్ర తెలిపిన వివరాలు.. ఇంటి పక్కనే దొడ్డిలో గొర్రెలను ఉంచగా ఊర కుక్కలు దాడి చేసి నాలుగు గొర్రె పిల్లలను చంపి వేశాయన్నారు. తాను నిరుపేదనని గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. సుమారు రూ. 25వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే కందికుంట

**కదిరి టౌన్ :** ఏపీఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో కదిరి ఎమ్మెల్యేగా కందికుంట ఘన విజయం సాధించడంతో ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కదిరి డిపో మేనేజర్ మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కదిరి డిపోకు రావాల్సిన నూతన బస్సు సర్వీసులపై సమీక్షించారు. కదిరి డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎన్‌వి.రమణ, రామకృష్ణ, బైరిశెట్టి అశ్వర్థమయ్య, నారాయణస్వామి, రామచంద్ర, బాబుఖాన్ పాల్గొన్నారు.



కందికుంటకు పూలబొకే అందజేస్తున్న ఆర్టీసీ డీఎం

## పూర్వ విద్యార్థుల కలయిక

**కదిరి టౌన్ :** కదిరి రూరల్ మండలంలోని పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పట్లో చదువుకున్న విద్యార్థులందరూ పదేళ్ల తర్వాత ఓ చోటికి చేరి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడంతో పాటు ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి గురువులు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులు, గురువలకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధిలో వారి వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో చింతా నాగరాజు, వెంకటేష్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటుతో కూటమి సంబరాలు

**పుట్టపర్తి అర్బన్ :** దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ మూడోసారి ప్రమాణం చేసిన సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో ఎన్డీఏ కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఆదివారం కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి గా మోడీ ప్రమాణ స్వీకారం చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ చిన్నాభిన్నమైన ఏపీ అభివృద్ధికి కేంద్ర సహాయం ఉంటుందని భావించే చంద్రబాబు బిజెపితో పొత్తు పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండమరాజు, జ్యోతిప్రసాద్, సునీల్ వైట్ల, రామాంజనేయులు, బెస్త చలపతి, పిసి గంగన్న, శ్రీరామ్‌రెడ్డి, లక్ష్మీపతి, సామకోటి ఆదినారాయణ, జనసేన అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## బోగాధమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**గాండ్లపెంట :** మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని సాదలవాడపల్లి వద్ద వెలసిన బోగాధమ్మ ఆలయంలో ఆదివారం సోమయాజులపల్లి పంచాయతీలోని కత్తివారిపల్లికి చెందిన ఎంపిటీసీ ఎనుముల జయరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్డీఏ కూటమి కేంద్రం, రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో గెలవడంతో బోగాధమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి మొక్కు తీర్చుకొని జ్యోతులు, బాణాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కుట్టు మిషన్ అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

## కుట్టుమిషన్ వితరణ

**పుట్టపర్తి అర్బన్ :** ఓ నిరుపేద కుటుంబానికి సత్యసాయి భక్తుడు ఆదివారం కుట్టుమిషన్ అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డుకు చెందిన సయ్యద్ షేక్షావలి గతంలో కరోనాతో మృతి చెందాడు. ఆయన భార్య బీబీ తన ఇద్దరు కుమారులను పోషించుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని ఖిద్మత్ ఏ ఖాల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శామీర్ సత్యసాయి భక్తునికి వివరించాడు. దీంతో అతను ఆ కుటుంబానికి రిటైర్డ్ బిసి వెల్ఫేర్ అధికారి రామప్ప ద్వారా కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో షాకీర్, అలీ, చాంద్‌బాషా, సాయి, జావిద్ పాల్గొన్నారు.

## టిడిపి విజయోత్సవ ర్యాలీ

**మడకశిర :** రొళ్ల మండల పరిధిలోని దాసప్పపాల్యం, ఎం.రాయపురం గ్రామపంచాయతీల్లో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో టిడిపి రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు విఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిద్దిగంగప్ప, రామకృష్ణ, భరత్, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, కూటమి అభ్యర్థులు పెద్దఎత్తున విజయం సాధించడంతో తెలుగుతమ్ముళు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో డిజె పెట్టి నృత్యాలు చేశారు. వారు మాట్లాడుతూ టిడిపి మొదటి నుంచీ బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసప్పపాలెం నాగరాజు, మాజీ ఎంపీపీ కృష్ణప్ప, రియాజ్, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.